మధ్యాహ్న భోజన కార్మికుల సంబరాలు

పెంచికల్‌పేట్ : మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి నుండి రూ.3వేలకు వేతనం పెంచడాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ అనేక పోరాటాలు చేయడంతోనే ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. కార్మికులతో కలిసి జీవో విడుదల చేసినందున స్వీట్లు పంచిపెట్టారు. ఈ నెల 15న రాష్ట్ర కమిటీ హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి అందరు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు విమల, మౌలూరి కమల, రెహమత్‌బీ, సరిత, పద్మ లత, శశికళ పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

శనివారం 11 ఫిబ్రవరి 2023

బదిలీపై వెళ్లిన సీనియర్ రికార్డ్ అసిస్టెంట్‌కు సన్మానం

జైనూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొన్నేండ్ల నుండి విధులు నిర్వర్తిస్తున్న రికార్డ్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లడంతో శుక్రవారం ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సీనియర్ రికార్డ్ అసిస్టెంట్ షేక్ ఇబ్రహీం కళాశాలకు మంచి సేవలందించారని అభినందించారు. కళాశాలకు సంబంధించిన ప్రతి విద్యార్థి వివరాలతో సహా కళాశాల రికార్డులను చక్కగా నిర్వహించి కళాశాలకు ఎంతో మంచి పేరు తీసుకొచ్చారని గుర్తు చేశారు. జైనూర్ నుండి జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయానికి వెళ్లడంతో ఆయనకు ప్రత్యేక బహుమతులు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సరస్వతి, శ్రీనివాస్, ప్రకాష్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ కలెక్టర్‌గా హేమంత్ బోర్కాడే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ నూతన జిల్లా కలెక్టర్‌గా హేమంత్ బోర్కాడేను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2020లో ఆసిఫాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ విధులు నిర్వర్తించి నిర్మల్ అదనపు కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. తాజాగా కలెక్టర్ల బదిలీలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ కలెక్టర్ కోసం నాయకులు ఒత్తిడి తీసుకురాగా హేమంత్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలుస్తోంది.

రెగ్యులర్ చేయాలని నిరసన

నవతెలంగాణ-ఇచ్చోడ

సమగ్ర శిక్ష అభియాన్‌లోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు సురేష్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్న విధంగానే సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేసి, పేస్కేల్ వర్తింపజేయాలని కోరారు. సాధారణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఆరోగ్య, జీవిత బీమా వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 11న శనివారం నిర్వహించాల్సిన జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా వేస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వాహణాధికారి గణపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్, రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నందున స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా వేస్తున్నామన్నారు. తదుపరి సమావేశ నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 11న శనివారం లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు లోక్ అదాలత్ ప్రారంభమవుతుందని తెలిపారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

ఆదివాసులపై కేసీఆర్‌ది కపట ప్రేమ : ఎంపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏజెన్సీ ప్రాంతాల్లో సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసులపై కపట ప్రేమ కనబరుస్తున్నారని, అసెంబ్లీలో ఆదివాసీ గిరిజనులను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తుడుం దెబ్బ మాజీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ సోయం బాపురావు పేర్కొన్నారు. ఈ మేరకు ఢిల్లీ నుండి ఎంపీ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై భగ్గుమన్నారు. ముందు నుండి కేసీఆర్ ఆదివాసులను మోసం చేస్తూనే ఉన్నారని, పోడు భూముల సర్వే, దరఖాస్తుల పేరిట నాటకమాడి ఇప్పుడు అటవీ భూములు ఆక్రమించుకుంటున్నారని పేర్కొన్నారు. అటవీ, పోలీస్ అధికారుల అణచివేతను ఇక సహించబోమన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఆదివాసీ జాతిని కించపరుస్తూ ముఖ్యమంత్రి అసెంబ్లీలో వ్యాఖ్యలు చేయడాన్ని ఎంపీ ఖండించారు.

కేసీఆర్ వ్యాఖ్యలు సరికాదు

- టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదివాసీల వల్లే అటవీ ప్రాంతం నాశనమవుతోందనే విధంగా అసెంబ్లీలో సీఎం కేసీఆర్ మాట్లాడడం సరికాదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కడైనా అటవీ ప్రాంతం ఉందంటే అది ఆదివాసీలు ఉన్న ప్రాంతంలోనే ఉందని ఆయన అన్నారు. మైనింగ్ కోసం బడా పారిశ్రామివేత్తలకు భూములు ఇవ్వడం వల్లే నేడు అటవీ ప్రాంతం నాశనమైందని అన్నారు. 2014 తర్వాత అటవీ భూములు నాశనమవుతున్నాయంటే అది అధికార బీఆర్‌ఎస్ నాయకుల వల్లేనని ఆయన స్పష్టంచేశారు. పోడు భూములకు పట్టాల విషయంలో బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే 2014 నుండి ఇప్పటి వరకు ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సింగరేణి పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



రెబ్బెన : మండలంలోని గోలేటిలో సింగరేణి పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.30వేలను విరాళంగా అందజేశారు. గురువారం జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో ఎడ్యూకేషన్ జీఎం, ఏరియా జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌కు అందజేసినట్టు కోర్ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గోలేటిలోని సింగరేణి పాఠశాలకు చెందిన 30 బ్యాంచ్‌ల విద్యార్థుల మహా సమ్మేళనాన్ని ఇటీవల నిర్వహించినట్టు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా శైలేశ్వర్

దిలావర్‌పూర్ : మండల కేంద్రానికి చెందిన పీసరి శైలేశ్వర్ బీజేపీ మండలాధ్యక్షునిగా నియమితులయ్యాడు. నిర్మల్ పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో శైలేశ్వర్‌ను మండలాధ్యక్షునిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలు గుర్తించి మండలాధ్యక్షునిగా నియమించినందుకు పార్టీ పెద్దలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

పత్తికి రూ.12వేలు ధర ఇవ్వాలని ధర్నా

- చెన్నూరు, నెన్నెల మండలాల్లో పత్తి కాలిపోయిన రైతులను ఆదుకోవాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్
- మున్సిపల్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పత్తి క్వింటాల్‌కు రూ.12వేల మద్దతు ధర ఇచ్చి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి సమస్యలపై కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వారం రోజులుగా మార్కెట్లలో పత్తి క్వింటాల్‌కు రూ.7వేలకు తగ్గించి దళారులు విపరీతంగా లాభాలు సంపాదిస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని తెలిపారు. మద్దతు ధర రూ.6380 ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్ ధరలను బట్టి ఈసారి రూ.9800కు అమ్మకాలు సాగాయన్నారు. ఇప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో ఇదే ధర కొనసాగుతోందని తెలిపారు. తెలంగాణలో వ్యాపారులు మిలాఖత్ అయి పత్తి ధరను రూ.7వేలకు తగ్గించారని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలు పేరు చెప్పి రైతులను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాలలో పత్తి పంట వేశారని, అధిక వర్షాలతో 8లక్షల ఎకరాలలో పత్తి పంట పూర్తిగా దెబ్బతిని నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఎకరానికి 60వేల రూపాయలు పెట్టుబడి పెట్టారని, కానీ 30వేలకు మించి ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధిక లాభాలు అర్జించే మధ్య దళారులను అరికట్టాలని, క్వింటాల్‌కు రూ.12వేలు ధర నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు చేస్తే అంతర్జాతీయ మార్కెట్ ధరలను చూస్తే ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. ప్రభుత్వాలు స్పందించని పక్షంలో రైతాంగాన్ని కదిలించి పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకె రవి, అత్తే సాగర్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్మ పున్నం, అబ్దుల్లా, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, గోమాస ప్రకాష్, దూలం శ్రీను, రాజారాం, జయరాజ్, బిఎస్పి ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు భూక్యా రాజు, కాదశి రవీందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడంకి చందు, కె.ప్రేమ్‌కుమార్, రమేష్, రైతులు తిరుపతి, శరత్, రవి, మల్లయ్య, బానేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



ప్రధాన భాషలపై పట్టు సాధించాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రాంతీయ భాషలతో పాటు హిందీ, ఇంగ్లీష్ భాషలపై పట్టు సాధించాలని ఎంపిడిఓ చౌహాన్ రాధ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భాషా నైపుణ్యం గురించి, పది పరీక్షల సన్నద్ధత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండి ఇంగ్లీష్ భాషపై మంచి పట్టు సాధించి రాణించాలని, ప్రతిరోజు పుస్తక పఠనం చేస్తే భాషపై చక్కటి అవగాహన వస్తుందని తెలిపారు. చదువుతోపాటు విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసి వారిని ప్రోత్సాహించి చక్కటి మార్గ నిర్దేశం చేస్తున్నందుకు ప్రధానోపాధ్యాయురాలిని, సిబ్బందిని అభినందించారు. ఉపాధ్యాయులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పిన విద్యార్థులకు ఎంపీడీఓ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, రిటైర్డ్ టీచర్ రామగిరి ప్రకాష్, సామాజిక కార్యకర్త మినాజ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : బీజేపీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని మహాలక్ష్మివాడలో బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ అధ్యక్షతన శక్తి కేంద్రం స్థాయిలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు వెంకటరమణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ మోసాలను, అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అలాగే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న వివిధ పథకాలను ప్రజలకు తెలిసేలా చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, పట్టణ నాయకులు దినేష్ మటోలియా, లాలా మున్న, బోయార్ విజయ్, మయూరిచంద్ర మహేంద్ర పాల్గొన్నారు.

బీజేపీ నాయకురాలు వ్యాఖ్యలు సరికావు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఇటీవల బీజేపీ నాయకురాలు కేఆర్‌కే కాలనీ విషయంలో తమ పార్టీ నాయకులపై చేసిన ఆరోపణలు సరికావని ఆ కాలనీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దాసరి ఆశన్న అన్నారు. శుక్రవారం కాలనీ పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో తీవ్రమైన నీటి ఎద్దడితో ఇబ్బందిపడే కాలనీ వాసుల కష్టాలు తీర్చిన ఘనత ఎమ్మెల్యే జోగు రామన్నకే దక్కిందని తెలిపారు. కాలనీ అభివృద్ధిపై తమ నాయకుడు ఎమ్మెల్యే రామన్నపై సదరు నాయకురాలు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. వార్డు విషయంలో అనవసర దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. గతంలో కాలనీలో అనేక సమస్యలు ఉండేవని, ఎమ్మెల్యే కృషితో ఇక్కట్లన్నీ దూరమయ్యాయని స్పష్టం చేశారు. నీటి సరఫరా లేని సమయంలో జోగు ఫౌండేషన్ ద్వారా వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మిషన్ భగీరథ ద్వారా తాగు నీటిని ఇంటింటికి అందిస్తున్నారని వివరించారు. కాలనీ ప్రజలకు అందుబాటులో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయడమే కాకుండా వారి ఆరోగ్యా రీత్యా బస్తీ దవాఖానాను అందుబాటులోకి తెచ్చిన ఘనత తమ నాయకుడిదేనన్నారు. కోట్ల రూపాయలతో స్కూల్ నిర్మాణాలు చేపట్టి బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యను అందుబాటులో ఉంచారన్నారు. కాలనీ పరిస్థితులను పూర్తిగా మార్చి వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తూ ప్రజల ఆశీస్సులు అందుకుంటున్నారన్నారు. తమ నాయకునిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు చోటు, ఫరీద్, రవి, ఉజ్వల పాల్గొన్నారు.

క్లారికల్ సిబ్బందికి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలి



నవతెలంగాణ - రెబ్బెన

క్లారికల్ సిబ్బందికి వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. బెల్లంపల్లి ఏరియాలోని క్లారికల్ సిబ్బందికి కౌన్సిలింగ్ విధానాన్ని చేపట్టి బదిలీలు నిర్వహించాలని కోరుతూ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం క్లారికల్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ గతంలోనే క్లారికల్ సిబ్బందికి వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని జీఎంకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య 50 శాతం నిబంధన ఎత్తివేయాలని, వంద శాతం పారదర్శక వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డైరెక్టర్‌కు లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం కోర్టు ద్వారా నియామకం పొందిన 22 మందిని జూనియర్ అసిస్టెంట్లను, అదేవిధంగా 2022లో అంతర్గత నియామకాల ద్వారా కొత్తగా 141 మంది, 163 మందికి కౌన్సిలింగ్ పారదర్శకంగా నిర్వహించి బెల్లంపల్లి ఏరియా క్లారికల్ సిబ్బందికి వంద శాతం కౌన్సిలింగ్ వచ్చే విధంగా యాజమాన్యం వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి జగ్గయ్య, మారం శ్రీనివాస్, రాంసాగర్, క్లర్క్ సిబ్బంది రాజన్న, శ్రీనివాస్, జిల్లాల రవి, రమేష్, సత్యనారాయణ, రజినీకుమార్, విష్ణు పాల్గొన్నారు.

ఇలేగాంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



భైంసా : మండలంలోని ఇలేగాం గ్రామంలో క్రీ.శే కౌటిక్‌వార్ విఠల్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం బిజెపి నియోజకవర్గ నాయకులు రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే ఐక్యత భావం పెంపొందుతుందన్నారు. గ్రామానికి చెందిన కృష్ణ తన తండ్రి పేరిట టోర్నమెంట్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యత భావం కలుగుతుందన్నారు. ఇలేగాం గ్రామానికి చెందిన యువకులు చదువుల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాల్లో, వివిధ రంగాల్లో ఉండడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి సూర్యకాంత్‌రెడ్డి, బిజెపి నాయకులు మోహన్‌రావు పటేల్, టీఆర్‌ఎస్ నాయకులు భీంమావు సోలంకి, బిజెపి నాయకులు భోజారెడ్డి, వేణు, చక్రధర్ పటేల్, ఎంపిటిసి రజాక్, సర్పంచ్ ముత్యం, స్థానిక నాయకులు కృష్ణమూర్తి, రత్నాకర్, ఉపసర్పంచ్ ఉత్తమ్, శంకర్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన



పెంచికల్‌పేట్ : జిల్లా బాలల సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీ సిబ్బందికి బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పెళ్లికి సహకరించే వారిపై సైతం కేసులు పెడతామని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. ఎస్ఐ విజయ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినట్టయితే బాలల సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి చంద్రమౌళి, గణపురం కావ్య, బాలల సంరక్షణ సమితి అధ్యక్షురాలు శ్రీమతి, రీజన్ అధికారి శ్రీనివాస్, ఏఈఓ లావణ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలపై దృష్టి సారించాలి



నార్నూర్ : గ్రామాల్లో నిర్మిస్తున్న నర్సరీ పనుల్లో వేగం పెంచి మొక్కలపై దృష్టి సారించాలని డిఎల్పీఓ భిక్షపతిగౌడ్ సూచించారు. శనివారం గాదిగూడ మండలంలోని పర్యవాడ(కె) గ్రామంతో పాటు తదితర గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలో నింపిన మట్టి బ్యాగ్ నాటిన మొక్కలను పరిశీలించారు. ఎండకు మొక్కలు ఎండిపోకుండా రోజు క్రమం తప్పకుండా నీరు అందించాలన్నారు. అర్జుని గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్యశిబిరాన్ని పరిశీలించారు. అర్హులైన వారు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులను కోరారు. అనంతరం లోకారిలో కార్యదర్శులతో పల్లె ప్రగతి పనులపై సమావేశం నిర్వహించారు. హౌస్ టాక్స్ వసూలు ఈ నెల చివరికల్లా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఇంఛార్జి ఎంపీడీఓ సాయిప్రసాద్, కార్యదర్శులు ఉన్నారు.

ఎంపీడీఓ ధర్మారావుపేట జీపీ పరిశీలన



కాసిపేట : మండలంలోని ధర్మారావుపేట పంచాయతీలో ఎంపీడీవో ఎంపి అలీం పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. రాళ్లవాగు ప్రాజెక్ట్ కెనాల్‌ను పరిశీలించారు. ఇటీవల కెనాల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా రెండో పంటకు సాగు నీరు విడుదల చేయగా పరిశీలించారు. అనంతరం కెనాల్ పునరుద్ధరణ పనులను విజయవంతంగా పూర్తి చేసినందుకు కార్యదర్శిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అన్నపూర్ణ ఉన్నారు.

శిక్షణ కేంద్రాల పరిశీలన



రెబ్బెన: గోలేటి సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కేంద్రాలను బెల్లంపల్లి ఏరియా సేవా సమితి సభ్యురాలు స్వరూపరాణి దేవేందర్ సందర్శించారు. యువతులు కుట్టిన డ్రెస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు యాజమాన్యం వృత్తి శిక్షణలైన జ్యూట్ బ్యాగులు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్ శిక్షణ ఇప్పిస్తుందన్నారు. శిక్షణ పూర్తయ్యే లోపు ప్రతి ఒక్కరు స్వతహాగా డ్రెస్సులు కుట్టే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో లలిత గుప్తా, పద్మ స్వామి, శిక్షకులు రూప, లక్ష్మి పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



సిరికొండ :కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోచంపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడావి జయబాయి లచ్చు, పిట్ట బొంగరం వైద్య సిబ్బంది అశోక్, ఆనంద్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

వనదర్శినిపై విద్యార్థులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కుభీర్



మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం కుభీర్ అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వనదర్శినిపై అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి కోటేశ్వర్ విద్యార్థులకు అటవీలోని చెట్లను, జంతువులను అటవీ ప్రాంతాన్ని ఎలా కాపాడుకోవాలని తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు కోటేశ్వర్, గంగారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిష్ పాండ్ పనులను పరిశీలించిన ఏపీడీ

నవతెలంగాణ-కడెం



నచ్చన్ఎల్లాపూర్‌లో ఉపాధిహామీలో నిర్మించే ఫిష్ పాండ్ పనులను శుక్రవారం ఏపీడీ ఓస ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొలతల ప్రకారం పనిచేయాలని సూచించారు. రైతులు ఉపాధిహామీ పనులను ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగన్న, ఏపీఓ జయదేవ్, టీఏ కాంతారావు, ఎఫ్ఏ కమలాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, కంటి చూపు సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీడీఓ చౌహన్ రాధ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి మండల పరిషత్ సిబ్బందితో కలిసి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా తెలంగాణలోని అన్ని జిల్లాల ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కండ్లాద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను అందజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పుష్ప, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-బేల

మండలంలోని పాఠన్ గ్రామంలో శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నాబార్డ్ ఎస్ఓ అశోక్ మాట్లాడుతూ బ్యాంకుల నుండి పొందే పంట రుణాలు, మహిళా సంఘాలు, రుణాలు నిర్ధారిత సమయంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని పేర్కొన్నారు. తాము సంపాదించిన సంపాదనలో కొంత బ్యాంకులలో పొదుపు చేయాలని ప్రతి ఖాతా కలిగినటువంటి వ్యక్తి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలియజేశారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా బ్యాంకుకు వెళ్లకుండానే ఇంటిదగ్గర బ్యాంక్ లావాదేవీలు చేసుకోవచ్చని అన్నారు. మీకు ఫోన్ ద్వారా ఎవరైనా ఓటీపీ ఏటీఎం పిన్ నెంబర్లు అడిగిన ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదని బ్యాంక్ సిబ్బంది ఎవరు కూడా మీ వ్యక్తిగత ఓటీపీ గాని ఎటిఎం పిన్ నెంబర్లు గాని అడగరని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఫైజుల్లా ఖాన్, బ్యాంక్ క్యాషియర్ హరీష్, అయ్యుబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింబారావు కుటుంబానికి 20 ఎకరాల భూమి ఇవ్వాలి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన బిడ్డ కూలి పని చేసి జీవనం కొనసాగించే కోవ లింబారావు కుటుంబానికి రూ.20 లక్షలతో పాటు ఎకరాల భూమి అందించాలని ఎస్టీ సెల్ జిల్లా చైర్మెన్ సెడ్మకి ఆనంద్ రావ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యూసుఫ్ ఖాన్ అన్నారు. శుక్రవారం నాగల్‌కొండా గ్రామంలో లింబారావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేను రోజులు క్రితం నాగల్‌కొండ బిట్ ఆఫీసర్ కల్యాణి అధ్యర్యంలో ఫారెస్ట్ అధికారులు కట్టెల కోసం వెళ్లిన ఆయన పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. జల్, జంగల్, జమీన్‌ను కాపాడుకొనే ఆదివాసీ బిడ్డలపై బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ఆదివాసులపై టార్గెట్ చేసి దాడి చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వారి కుటుంబానికి రూ.20 లక్షలతో పాటు 20 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి వెంట నాయకులు విలాస్, శివాజీ పటేల్, కరీమ్ ఖాన్, నాగోరావు, విష్ణు, దేవిదాస్, మెస్రం మోతిరాం, గ్రామ పటేల్ మెస్రం మారు, కాశీరామ్, రాయిసిడం యాదవ్, కోవ రాము, సయ్యద్ అలీ పాల్గొన్నారు.

మాలీలకు ఎస్టీ హోదా తీర్మానం పట్ల హర్షం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబడ్డ మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వానికి అసెంబ్లీలో తీర్మానం చేసి పంపడం పట్ల మాలీ మహా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా మాలీలు ఎస్టీ హోదా కోసం అనేక పోరాటాలు చేశారని, అది గమనించిన సీఎం కేసీఆర్ చారితాత్మక నిర్ణయం తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు జోగు రామన్న, కోనేరు కోనప్ప, రాథోడ్ బాపూరావు, ఇతర జిల్లా ఎమ్మెల్యేలు అందుకు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు తెండుగురే శ్యామ్ రావు, సాంబన్న షిండే, విజయ్ వాద్గురే, అంబేకర్ చంద్రశేఖర్, మెంగాజి గురునూలే, నారాయణ గురునూలే, గొత్రే గోపాల్, ఆదే వసంతరావు, నాందేవ్, మధుకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముండే తాతవార్ లక్ష్మీ ఇంట్లో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంట్లోని పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వార్డు కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం తక్షణ సాయంగా రూ.5వేలను బాధితురాలికి అందచేసి భరోసా కల్పించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకుని బాధితులకు ధైర్యం చెప్పారు.

జాతీయ మహాసభల కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-నిర్మల్

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభల కరపత్రాలను శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ మహాసభలు కలకత్తాలో 15 నుండి 18 తేదీ వరకు జరగనున్నాయని అన్నారు. మహాసభలకు జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు సీనియర్ నాయకులు రాష్ట్రం నుండి ఎంపిక చేయబడిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రధానంగా వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, గిరిజన, గిరిజనేతర పేదలందరికీ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించనున్నట్టు తెలిపారు. వ్యవసాయ కూలీలకు రోజు కూలీ రూ.600 పెంచాలని, వ్యవసాయ కార్మికులకు బిల్డింగ్ వర్కర్స్‌కు ఇచ్చే ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, నెలకు రూ.6000 పెన్షన్ ఇవ్వాలని ఈ మహాసభల్లో తీర్మానాలు చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కన్వీనర్



డి.పోశెట్టి, ఆఫీస్ ఇన్‌చార్జి అఫ్జల్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలని ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు ధరమ్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కేజీబీవీ కళాశాలలో మధ్యాహ్న సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యూలరైజ్ ప్రకటించడం హర్షనీయమని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యూలరైజ్‌ను స్వాగతిస్తున్నామని, సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహించే కాంట్రాక్టు ఉద్యోగులు దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కూడా రెగ్యూలర్ చేసి, హెల్త్ కార్డులు, పేస్కేల్‌ను వర్తింపజేయడంతో పాటుగా అన్ని రకాల సెలవులు, జీవిత భీమా, ఆరోగ్య భీమా లాంటి సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం నాయకులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు.

గిరిజన గ్రామాల రోడ్డు సమస్యలను పరిష్కరించండి

- తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన గ్రామాల రోడ్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వడగావ్ గ్రామపంచాయతీ పరిధిలోని జెండాగూడా గ్రామంలో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామం ఏర్పడి ఏండ్లు గడుస్తున్నా సమస్యల పరిష్కారం కావడం లేదని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు మాట్లాడారు. యేండ్లు గడుస్తున్న ఆదివాసీ గిరిజన గ్రామీణ ప్రాంతాలలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటి వరకు అనేక ప్రభుత్వాలు అధికారంలో వచ్చి వెళ్లి పోయాయని అన్నారు. కానీ ఆదివాసుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ఆదివాసుల సంక్షేమం కోసం ఏర్పడిన ఐటీడీఏ సైతం సమస్యలను పరిష్కరించడం లేదని అన్నారు. వెంటనే జెండాగూడా గ్రామానికి బిడ్జి నిర్మాణం చేపట్టి, రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఇటీవల



సరైన రోడ్డు మార్గం లేక దారి మధ్యలో మరణించిన విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం కానీ యెడల ఉద్యమ బాటపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ గోవింద్ రావ్, ఎంపీటీసీ మధుకర్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు భారత్, విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు పుర్క చిత్రు, ముఖాడే ఉత్తం, భగవంతరావ్, రాధాబాయి, కల్యాణి, లక్ష్మి, పోచ్చుబాయి, భీంరావ్, బాపురావ్, జంగు గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదు

- ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ అన్నారు. ఈ మేరకు స్థానిక కేబి ప్రాంగణంలోని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన తెగలలో నూతనంగా వాల్మీకి బోయలను, కైతి లంబాడీలు, మరికొన్ని కులాలను చేరుస్తామని అసెంబ్లీ ఎస్టీ జాబితాలో ప్రవేశపెడతామని తీర్మానం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నమని అన్నారు. గిరిజనుల్లో ఉప తెగలను అభివృద్ధి చేయాల్సింది పోయి మరికొన్ని కులాలను కలపితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఎస్టీలలో ఆదివాసులు అభివృద్ధికి నోచుకోకుండా జీవనాన్ని సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కొన్ని గిరిజన తెగలు అంతరించే ప్రమాదం ఉందని ఆ తెగలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములపై హక్కుదారులు కాదని, ఆక్రమణదారులని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడం విడ్డురంగా ఉందన్నారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఎందరో ఆదివాసులు పోడు భూములపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నారని అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ వైఖరి వల్ల తమ హక్కులు కాలరాయడమేనని అన్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు ఆదిలాబాద్ నుండి భద్రాద్రి వరకు చైతన్య యాత్ర చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సిడం జంగుదేవ్, నాయకులు పెందూర్ త్రిమూర్తి, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం లేకుండా చూడాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

పనులలో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అభివృద్ధి పనులలో జాప్యం జరగకుండా తమవంతు బాధ్యతగా సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. ఆయా మండలాల్లో ఉన్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులు, తహసీల్దార్ కార్యాలయ వివరాలు, సిబ్బంది వివరాలు ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఆయా మండలాల్లోని పాఠశాలలను సందర్శించి, నాణ్యత ప్రమాణాలు,



మెనూ ప్రకారం భోజనం, పరిశుభ్రత వాటిని పరిశీలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. పిల్లలతో భోజనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్ఓ లోకేష్, ఆర్డీఓ స్రవంతి, రవికుమార్, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



వ్యాయామంతోనే అనారోగ్యం దూరం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

వ్యాయామంతోనే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని విద్యార్థులకు మానసిక, శారీరక దృఢత్వం అలవడుతుందని సర్పంచ్ ముత్యం రెడ్డి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిధులతో శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీ ఉన్నత పాఠశాలలో రూ.15వేలు విలువ చేసే ఫిటినెస్ వస్తుసామాగ్రిని విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ నవిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ రాజ్, వీడీసీ సభ్యులు, శిక్షకులు సుమన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-తలమడుగు

ఉచిత పశువైద్య శిబిరాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం కుచులాపూర్ గ్రామంలో పశువులలో గర్భకోశ వ్యాది నివారణ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్ హజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ఎర్పాటు చేసిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. పశువైద్యాధికారి దూద్‌రాం మాట్లాడుతూ ఈతకు రాని పశువులను డాక్టర్‌ను సంప్రదించి, గొడ్డు బారీతనం నుండి కాపాడి వాటిని పరీక్షించుకొని ఎదకు వచ్చే విధంగా పశువులను తయారు చేసుకొని, కృత్రిమ గర్భధారణ ద్వారా మేలురకం దూడలను పొందవచ్చని తెలిపారు. 3నుంచి 6 నెలల వయస్సు గల ఆడ అవు లేగలను, గేదె లెగలకు బ్రూసెల్లోసిస్ వ్యాది నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. దీంతో ఆడలేగా పెద్దది అయ్యాక గర్భం దాల్చినప్పుడు అబార్షన్ కాకుండా కాపాడు కోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహిత ప్రభ, గ్రామస్తులు దేవన్న, వామన్, సంతోష్ పశువైద్య సిబ్బంది సౌమ్య, స్వామి, విజయ్, సాయి, గంగన్న, రాజు, సుదర్శన్, గీసా మల్లయ్య, రణవీర్ పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రశంసించిన విదేశీయుడు



నవతెలంగాణ-జైనథ్

కంటి వెలుగును లండన్‌కు చెందిన విదేశీయుడు ఆండ్రు షేఫ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మండగడలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని లండన్‌కు చెందిన విదేశీయుడు ఆండ్రు షేఫ్ తన నేత్రాలను పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను భారతదేశం సాంస్కృతి, సాంప్రదాయాలను, కట్టడాలను అనేక ప్రదేశాలను వీక్షించడానికి వచ్చానని అన్నారు. ఇక్కడి ప్రభుత్వం తమ ప్రజలకి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్పగా ఉందని తెలిపారు. నేను లండన్‌లో కంటి పరీక్ష చేసుకోగా డాక్టర్లు ఏదైతే సమస్యను తెలియజేశారో, ఇక్కడ కూడా కంటి వైద్యులు అదే సమస్యను గుర్తించి, చికిత్స గురించి తెలిపారని ఆనందం వ్యక్తం చేశారు. తాను పర్యవేక్షణలో భాగంగా జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామానికి వచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ రావు, ముడుపు ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం బీసీబంధును ప్రకటించాలి

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ప్రభుత్వం బీసీబంధును ప్రకటించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చదివిన చదువుకు ఉద్యోగాలు లేక ఎందరో మంది బీసీ నిరుద్యోగులు, ఉద్యోగాల కోసం చెప్పులు అరిగేలా రోడ్లపై తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 80 శాతం బీసీ కుటుంబాలే ఉన్నాయని జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న యువతలో బీసీ యువతే అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీబంధును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ సబ్సిడీలను కాలరాసిన ప్రభుత్వం బీఆర్ఎస్ : బీజేపీ

నవతెలంగాణ-జైనథ్

రైతు వ్యవసాయ సబ్సిడీలను కాలరాసిన ప్రభుత్వం బీఆర్ఎస్ అని బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటరమణరెడ్డి అన్నారు. మండలంలోని మాకొడ గ్రామంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో పాయల్ శంకర్ అధ్యక్షతన శక్తి కేంద్రం కార్నర్‌ను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు వెంకట రమణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు రైతుబంధు తప్ప ఏమీ ఇవ్వడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, ఎంపీటీసీ లోక కరుణాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు రాందాస్, జిల్లా అసెంబ్లీ కన్వీనర్ విజయ్, మయూర్ చంద్ర, రమేష్, చంద్రకాంత్, సుభాష్, బింగి వెంకన్న, రమేష్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓంకారేశ్వర ఆలయాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని వెంకటాద్రి పేట్‌లోని పురాతన ప్రసిద్దిగాంచిన శ్రీ ఓంకారేశ్వర శివాలయాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాబోయే మహా శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రావెల్ రోడ్డు మార్గం, ఆలయ పరిసరాల్లో సానిటేషన్ పరంగా శుచి, శుభ్రత, మంచినీరు, పార్కింగ్ స్థలం, టాయిలెట్స్, డ్రైనేజీ, పలు ఏర్పాట్లను చేస్తున్నామని అన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణ ప్రజలతో పాటు పరిసరా గ్రామీణ ప్రజలు భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వస్తారని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చైర్మెన్ వెంట ఏఈ హరిభువన్, స్థానిక కౌన్సిలర్ లక్కాకుల నరహరి, కౌన్సిలర్లు మేడారం అపర్ణ ప్రదీప్, బిట్లింగ్ నవీన్, కాంట్రాక్టర్ పులాన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 11 ఫిబ్రవరి 2023

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న నిరసన శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. శుక్రవారం ఉదయమే కార్మికులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కార్మికులకు బకాయి ఉన్న నాలుగు నెలల వేతనాలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని, కార్మికుల హాజరు పాయింట్ వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించని పక్షంలో సోమవారం నుండి సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని 33/11 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎఈ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాసిపేట : మండలంలోని కొండాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారం మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఎస్. స్వర్ణలత తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

డ్వాక్రా భవన్‌కు ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

మండలంలోని అంకత్‌పల్లి గ్రామంలో డ్వాక్రా మహిళా సంఘ భవన్‌కు శుక్రవారం ఎమ్మెల్యే దివాకర్‌రావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో స్వయం సహాయ సంఘాల అభివృద్ధికి వీఓఏలు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. డ్వాక్రా భవన్ కోసం రూ.5లక్షలు సీడీపీ ద్వారా మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అంతకు ముందు వీఓఏ జీతాలు పెంచాలని ఎమ్మెల్యేకు ఆ సంఘం తరపున వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, సర్పంచ్ గణవేణి శైలజ-సుధాకర్, ఎంపీటీసీ కల్లు దావీదు, వీఓఏ సంఘం నాయకులు లింగంపల్లి వెంకటేష్, యాదవ సంఘం నాయకులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భూమేష్, పోసవ్వ, మౌనిక దీప సత్తవ్వ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆటంకం కల్గొద్దు



నవతెలంగాణ-జైపూర్

అభివృద్ధి పనులకు ఆటంకం కలగొద్దని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో గల తన ఛాంబర్‌లో ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డొబ్రియల్ జాతీయ రహదారి-63కు సంబంధించిన ఈఈ మనోహర్‌రావుతో జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన అటవీ అనుమతులపై సమీక్షించారు. ఇందారం ఎక్స్ రోడ్డు నుండి కోటపల్లి మండలం అర్జున గుట్ట సరిహద్దు ప్రాణహిత నది వరకు గల జాతీయ రహదారి నిర్మాణంలో ప్రభుత్వ పరంగా అటవీశాఖ నుండి అందాల్సిన అనుమతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జాతీయ రహదారి నిర్మాణపు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, రహదారిలో గల వంతెనల నిర్మాణాలు వెను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో పాల్గొన్న రహదారి నిర్మాణ సంస్థ మధుకాన్ కంపెనీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుతో మాట్లాడుతూ రహదారి నిర్మాణపు పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విలువైన భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు



నవతెలంగాణ-తాండూర్

కోట్ల రూపాయల విలువ చేసే అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కబ్జాదారుల నుండి కాపాడారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, తహసీల్దార్ కవితతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అక్రమ కట్టడాలను తొలగించారు. రేచిని రైల్వేస్టేషన్ పరిధిలోగల తాండూర్ శివారు సర్వే నెంబర్ 612 ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని, శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హెచ్చరిక బోర్డులు తొలగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను పోలీస్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ భూములలో జరిగే నిర్మాణాలను పంచాయతీ అధికారులు అనునిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం అదన కలెక్టర్ తాండూర్ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు పెట్టాలన్నారు. పదో తరగతి పిల్లలు పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరును పరిశీలించారు. పరీక్షల్లో అత్యున్నతమైన ఫలితాలు రాబట్టాలని హెచ్‌ఎం ప్రేమలతకు సూచించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డైనింగ్ హాల్ నిర్మాణపు పనులను పర్యవేక్షించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వారి వెంట ఆర్ఐ ఎజాజొద్దీన్, తాండూర్ పంచాయతీ సెక్రెటరీ తపాస్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి గని కార్మికుడు మృతి



జైపూర్ : ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి గని కార్మికుడు మోరె రమేశ్(32) మృతి చెందాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ఇందారం ఎక్స్ రోడ్డు సమీపంలో శ్రీరాంపూర్ వైపు గల ప్రధాన రహదారి పక్కన పార్కింగ్ చేసి ఉన్న లారీని రమేశ్ అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో పార్కింగ్ చేసి ఉన్న లారీని అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో మోటార్ సైకిల్ నుండి పడిపోయిన రమేశ్ తలకు బలమైన దెబ్బలు తగిలాయి. సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుని తండ్రి మోరె రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రమేశ్ శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గనిలో బదిలీ వర్కర్‌గా పని చేస్తుండేవాడు. మోటార్ సైకిల్‌పై గోదావరిఖని నుండి రామకృష్ణాపూర్ వైపు ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.

3నెలల్లో 3వ దశ

సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణ పనులు పూర్తి

- 224 మెగావాట్లకు తోడు మరో 76 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- జైపూర్ ఎస్టీపీపీలో మరో 10 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్

నవతెలంగాణ-జైపూర్

300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు మూడు దశల్లో పూర్తి చేయాలని భావించిన సింగరేణి నిర్ణీత గడువుతో నిర్మాణ పనులు పూర్తి చేస్తోంది. మొదటి రెండు దశల్లో నిర్మించిన ప్లాంట్ల ద్వారా 224 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ఇప్పటికే ప్రారంభించింది. 3వ దశలో చేపట్టిన నిర్మాణపు పనుల పూర్తి చేసి ఉత్పత్తిని ప్రారంభించడానికి ఏర్పాట్లు ముమ్మరం చేస్తుంది. మూడవ దశలో చేపట్టిన 76 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లలో కొత్తగూడెం ఏరియాలో 22.5 మెగావాట్లు, అదే ఏరియాలో మరో 10.5మెగావాట్లు, చెన్నూర్ వద్ద 11 మెగావాట్లు, రామగుండం-3 ఏరియాలోని ఓసీ ఓవర్ బర్డెన్ డంపుపై 22 మెగావాట్లు వీటితో పాటు జైపూర్ ఎస్టీపీపీ జలాశయంపై ఇప్పటికే నిర్మించిన 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌తో పాటు మరో 10 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు నిర్మాణంలో నిమగ్నమైంది. మే నెలాఖరులోగా నిర్మాణపు పనులు పూర్తి చేసి జూన్ నెలలో మూడవ దశలో నిర్మించిన 76 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తిని ప్రారంభించడానికి కసరత్తు ముమ్మరం చేస్తుంది. బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించిన సింగరేణి తొలి ప్రయత్నంగా 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వ రంగ ఎన్టీపీసీ రామగుండం 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును నెలకొల్పగా రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి తనకు చెందిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో గల జలాశయంపై 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు ఏర్పాటుతో పాటు ఉత్పత్తిని ప్రారంభించింది. దీనికి తోడు మరో 10 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంటును జైపూర్ ఎస్టీపీపీ జలాశయంపై నిర్మించి జూన్‌లో ఉత్పత్తిని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంది. అదేవిధంగా కరీంనగర్ మానేర్ డ్యాం జలాశయంపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసుకోవడంతో పాటు 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఆవరణలో మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం అడుగులు వేస్తోంది. 3వ దశలో చేపట్టిన 76 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణపు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవడానికి నిర్మాణ సంస్థలతో ఎప్పటికప్పుడు సమీక్షించడంతో పాటు సంస్థ పరమైన సహాయ సహకారం అందించడం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా సింగరేణి సంస్థ చర్యలను ముమ్మరం చేస్తోంది. ప్లాంట్ల నిర్మాణపు పనులు చేపట్టిన జెన్‌సోల్, ఎన్‌రిచ్ సంస్థలు ఇప్పటికే సాయిల్ టెస్టింగ్, సర్వే పనులు, భూములు చదును, సోలార్ ప్యానల్స్ సమకూర్చుకోవడంతో పాటు మే నెలాఖరుకల్లా నిర్మాణపు పనుల పూర్తికి హామీ ఇచ్చింది.



మాలీ కులస్తుల సంబరాలు



కౌటాలలో..



బెజ్జూర్‌లో..

నవతెలంగాణ - కౌటాల

మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో కలిపేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుక్రవారం అసెంబ్లీలో తీర్మానం చేయడంతో మండలంలోని మాలీ కులస్తులు మహాత్మా జ్యోతిబాపులే విగ్రహం వద్ద టపాసులు పేల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదె శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నోఏండ్ల పోరాట ఫలితమే అసెంబ్లీలో మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి తీర్మానం చేయడం జరిగిందన్నారు. కేంద్రంలో ఆమోదం పొందితే ఎస్టీ జాబితాలో చేరిపోతామని, వెనుకబడిన మాలీ కులస్తులు అభివృద్ధి చెందే అవకాశముంటుందన్నారు.

బెజ్జూర్ : మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో మాలీ కులస్తులు సంబరాలు నిర్వహించారు. మండలంలోని ఎలుకపెల్లి, సిద్దాపూర్, కృష్ణపెల్లి, బెజ్జూర్, బారెగూడ తదితర గ్రామాల్లోని మాలీ కులస్తులు టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కొన్ని సంవత్సరాల నుండి మాలీలను ఎస్టీ జాబితాలో చేర్పించాలని పోరాటం చేస్తుండగా తాజాగా ముఖ్యమంత్రి ప్రకటనతో హర్షం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాలీ సంఘం మండలాధ్యక్షుడు ఆదె అశోక్, మాలీ సంఘం నాయకులు రామకృష్ణ, సురేష్, తిరుపతి పాల్గొన్నారు.

తలమడుగు : అన్ని రంగాలలో వెనకబడ్డ మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం పట్ల ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే కృతజ్ఞతలు తెలిపారు. 22 సంవత్సరాలుగా హోదా కోసం అనేక పోరాటాలు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని తెలిపారు. దీనికి సీఎంతో పాటు రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జోగు రామన్న, కోనేరు కోనప్ప, రాథోడ్ బాపురావుకు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన యువత అభివృద్ధే లక్ష్యం

- పెసా జిల్లా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు



నవతెలంగాణ - జైనూర్

మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ పరిధిలో గల గిరిజనుల అభివృద్ధి లక్ష్యంతోనే ఉచితంగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా పెసా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని దేవ్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల చెరువు వద్ద ప్రత్యేకాధికారి సత్యనారాయణ, విజయ్‌కుమార్‌తో కలిసి గిరిజన యువతకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, కెరమెరి మండలాల్లోని సుమారు 10 చెరువులకు సంబంధించి 159 ఆదివాసీ గిరిజన లబ్ధిదారులకు నూతన గిరిజన మత్స్యశాఖ సహకార సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసుల్లో ఉన్న నైపుణ్యాన్ని శిక్షణను అందించి వారిని ఆర్థికంగా ఎదిగేందుకు శిక్షణనందిస్తున్నామన్నారు. చెరువులో ప్రభుత్వం నుండి మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపలు పట్టుకోవడానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దీనికోసం గ్రామాల నుండి ఆదివాసీ గిరిజన గ్రామాల్లో దేవ్‌గూడ, జెండగూడ, దుబ్బగూడ, గౌరీ లేండిగూడ, రాఘాపూర్, కేస్లగూడ, పార్డా, కల్లాం, పొచ్చంలొద్ది, హెట్టడ్‌హడక్‌నూర్ లాంటి గిరిజన గ్రామాల నుండి యువతకు ఉచితంగా శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెసా చట్టం మొబలైజర్ తానాజీ, విష్ణు, మారుతి, జంగు, మధూకర్, నరేష్, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

భీమారం : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామ సమీప అటవీ ప్రాంతంలో గుంతల తవ్వకాల పనుల నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామానికి చెందిన నైతం బానయ్య(54) పనికి వెళ్లి గుంత తవ్వుతుండగా తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. ఒక్కసారిగా కుప్పకూలిపోగా గమనించిన తోటి కూలీలు వెంటనే 108 అంబులెన్సకు సమాచారం అందించారు. ఎడ్ల బండిలో అంబులెన్స్‌కు ఎదురుగా తరలించారు. 108 సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడికి భార్య భూదేవి, కుమారుడు ఉన్నారు.

సాంకేతికతో కూడిన సృజనాత్మకతను అలవర్చుకోవాలి



నవతెలంగాణ - రెబ్బెన

విద్యార్థులు మారుతున్న నూతన ఆవిష్కరణలకు తగినట్టుగా సాంకేతికత నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని, తద్వారా ప్రపంచంతో పోటీ పడడానికి అన్ని రంగాల్లో సంసిద్ధంగా ఉంటామని సింగరేణి ఎడ్యుకేషన్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరావు విద్యార్థులకు సూచించారు. గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 40వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. గోలేటి సింగరేణి పాఠశాలకు ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను అందిస్తామని తెలిపారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు, క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. గోలేటి సింగరేణి పాఠశాలలో సీబీఎస్‌సీ సిలబస్ అమలు చేయాలని, ఇక్కడి నుండి ఇతర ప్రయివేటు పాఠశాలలకు వెళ్లే పిల్లలు సింగరేణి పాఠశాలలోనే తమ చదువును కొనసాగిస్తామని బెల్లంపల్లి ఏరియా టీబీజీకేయస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. సింగరేణి పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు చేసిన స్వాగతం పాట, బంజారా పాటతో పాటు జానపద పాటలు, పెద్దలు పనికి పిల్లలు బడికి అనే దృశ్య నాటకం అలరించింది. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం గుప్తా, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, సేవా సమితి అధ్యక్షురాలు స్వరూప, పాఠశాల పూర్వ విద్యార్థి ఆర్మీ జవాన్ సురేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయులు ఆర్ల రెడ్డి, హనుమంతు, స్వరూప, సమత, కవితలతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక పట్టివేత

జైనూర్: ఇసుక అక్రమ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని సీఐ రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తెల్లవారు జామున ఎస్ఐ మధుకర్‌తో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. కెరమెరి నుండి జైనూర్‌కు వస్తుండగా ట్రాక్టర్(టీఎస్ 20 టి 5331)ను పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించారు. ఇసుక రవాణా చేస్తున్నప్పుడు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుం చెల్లించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దందా చేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

14న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 14న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సంఘం నాయకుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీలతో కలిసి కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 40 ఏండ్ల నుండి పేద ప్రజలకు సేవలందిస్తున్నారన్నారని తెలిపారు. లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, ఐసీడీఎస్ బడ్జెట్ పెంచాలని, నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులతో సమానంగా వేతనం పెంచాలని, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించాలని, ఐసీడీఎస్‌లో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది రాజమణి, శ్రీలత, శకుంతల పాల్గొన్నారు.

ఎండు తెగులుకు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ - దహెగాం

వరిలో ఎండు తెగులు, కాండం తొలిచే పురుగుల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓలు శోభన్, వెన్నెల, సుశ్మిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఐనం, గిరవెల్లి గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిలో ఎండు తెగులుతో పాటు కాండం తొలుచు పురుగులు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఎండు తెగులు నివారణ కోసం ట్రైసైక్లోజోల్ లేదా కార్బన్‌డీయం, మాకోజిబ్ వాడాలని, అలాగే కాండం తొలుచు పురుగు నివారణ కోసం కార్బటోహైడ్రోక్లోరైడ్ లేదా కోరాజిన్‌ను వాడాలని సూచించారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా తమను సంప్రదించాలని సూచించారు.

12న పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

సీసీసీ సింగరేణి పాఠశాలలో 12న ఆదివారం నిర్వహించే పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని, పూర్వ విద్యార్థులు కో-ఆర్డినేటర్లు కోరారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగుతుందన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రముఖులతో ప్రసంగాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సుమారు 4000 మంది పూర్వ విద్యార్థులు, 200 మంది అధ్యాపకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని చావనీర్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా సాయం అవసరమైన మిత్రులకు చేయూతనిందించడం లక్ష్యమని తెలియజేశారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల ముఖ్యులు కొమరవెల్లి వాణిశ్రీ, రాజిరెడ్డి, సమన్వయకర్తలు సమ్మయ్య, డప్పు సమ్మయ్య, శంకర్, గోసిక మనోజ్, జక్కుల మల్లేష్, తాండ్ర శ్రీధర్, నరేందర్, రేఖ ఠాగూర్, రవిశంకర్, ఎస్ కుమార్ పాల్గొన్నారు.

సైనిక గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ - సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘిక సంక్షేమ కరీంనగర్ జిల్లాలోని రుక్మాపూర్ గురుకుల బాలుర సైనిక పాఠశాలలో ఆరు, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీసీఓ పోలోజు బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 15 వరకు అవకాశం ఉందన్నారు. హాల్‌టికెట్లు ఈ నెల 17 వరకు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 26న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా అటవీ శాఖాధికారిగా నీరజ్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా అటవీ శాఖ అధికారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎల్లందు ఎఫ్‌డీఓగా పనిచేస్తున్న నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌ను బదిలీ చేస్తూ అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి డోబ్రియల్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారిగా విధులు నిర్వహించి గత డిసెంబర్ నెలలో తన సొంత రాష్ట్రానికి వెళ్లిన దినేష్‌కుమార్ తర్వాత మంచిర్యాల జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిస్ సింగ్ అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

బీజేపీ భరోసా సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని రోళ్లపాడు గ్రామ పంచాయతీలో బీజేపీ భరోసా సమావేశం మండలాధ్యక్షుడు గోలెం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, మహేందర్‌గౌడ్, దాసరి మల్లయ్య, నాయిని శ్రీనివాస్, కార్యకర్తలు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో జరిగిన తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం అటుగా వెళుతున్న ఓ వ్యక్తిపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. భీంపూర్ మండలంలోని గోనె ధన్నూరుకు చెందిన ఆశన్న అనే వ్యక్తి నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో అకస్మాత్తుగా తేనెటీగలు దాడి చేసి కుట్టడంతో వ్యక్తి మొహం భాగంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న 108 వాహన ఈఎంటి రేఖ, పైలెట్ విఠల్ గౌడ్ 108 వాహనంలో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలను సందర్శించిన సెక్టోరల్ అధికారి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

యాపల్‌గూడ పాఠశాలను శుక్రవారం సెక్టోరల్ అధికారి జె నారాయణ సందర్శించి, మన ఊరు మన బడి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన 21 అంశాలతో కూడిన సమాచారాన్ని ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. యూడీఐఎస్‌ఈ 2022-23 ప్రక్రియ ఈనెల 13లోపు పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట యాపల్‌గూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ముజాఫర్ హుస్సేన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగన్న ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి

మద్యానికి బానిసై వ్యక్తి అత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని కప్పర్ల గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పర్ల గ్రామానికి చెందిన మామిడి రాజేందర్(45) మృతుని కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గ్రామస్తుల సహకారంతో కుమారునికి వైద్యం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో దిగాలు చెంది. మద్యానికి బానిసై శుక్రవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చూడగా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్టు ఇన్‌చార్జీ ఎస్సై రాధిక తెలిపారు. మృతుడి బార్య సువర్ణ పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

షోకాజ్ నోటీసులను ఖండిస్తున్నాం : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూమ్ ఆన్‌లైన్ సమావేశానికి హాజరు కాలేదనే కారణంతో ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఖండిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ స్వామి, వి.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే నోటీసులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ సమావేశానికి హాజరు కాకపోవడానికి కారణం సమాచార లోపమేనని అన్నారు. ఇది తెలిసి కూడా ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదని అన్నారు. అధికారుల తప్పిదాలను హెచ్‌ఎంలపై రుద్దడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అత్యవసర సమావేశాలకు ఫోన్ ద్వారా సమాచారం అందించి భౌతికంగా నిర్వహిస్తేనే బాగుంటుందని కోరారు.

గుట్ట వీరన్న శివాలయంలో మున్సిపల్ చైర్మెన్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని నాయుడివాడలోని పురాతన ప్రసిద్ధి గాంచిన శ్రీగుట్ట వీరన్న శివాలయం నూతన ఆలయ విగ్రహ ప్రతిష్టపన సందర్భంగా శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి రూ.10 లక్షలు నూతన ఆలయ నిర్మాణం అభివృద్ధి పనులకు మంజూరు చేశారని అన్నారు. మంత్రి కృషితో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 650పైగా నూతన ఆలయాలు నిర్మాణం చేసుకోవటం జరిగిందన్నారు. అలాగే గుట్ట వీరన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గుట్ట పై ప్రశాంతంగా ఆహ్లాదకరంగా ఉన్న వాతావరణంలో స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాయుడివాడ వార్డు ప్రజలతో పాటు, పట్టణ ప్రజలు స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పుల్లయ్యగారి కృష్ణ, గౌరవ అధ్యక్షులు కొరికంటి లింగన్న, స్థానిక కౌన్సిలర్ సాదం అరవింద్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు కొరికంటి గంగాధర్, రాం మహేందర్, నాయుడి రమేష్, ఆడెపు అశోక్, సుంకరి రమేష్, బిట్లింగ్ నవీన్, నాయుడివాడ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మద్దతు ధరలు అడిగితే అరెస్టులు చేయడం సరికాదు

నవతెలంగాణ-మంచిర్యాల

పత్తి రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేసిన రైతు సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని తెలంగాణ రైతు సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు కొండగొర్ల లింగన్న అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పత్తి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన తమను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారని అన్నారు. ప్రభుత్వం పత్తి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు అన్నారు. పత్తి రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. అరెస్టు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

మల్లన్న దేవుని గుడికి భూమిపూజ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని రెండ్లగూడ గ్రామంలో శుక్రవారం గ్రామ శివారులో గ్రామస్తులు మల్లన్న దేవుని గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. మల్లయ్య, లచ్చన్న, కొమురయ్యలు, ఉచితంగా రెండు గుంటల భూమి ఇవ్వడంతో ఆ భూమిలో గ్రామస్తులు రూ.10లక్షల వ్యయంతో నూతన గుడినిర్మాణాన్ని చేపట్టనున్నట్లు నూతన ఆలయ కమిటీ సభ్యులు బెడద గోపాల్, దాసరి తిరుపతి, నాగరాజు శ్రీను తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. త్వరలో ఆలయ పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లన్న దేవుని ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం

నవతెలంగాణ-జన్నారం

మండల కాంగ్రెస్ అనుబంధ సంఘాలకు, గ్రామ కమిటీ అధ్యక్షులను నియమించినట్లు మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శిగా బొంతల లక్ష్మణ్, ధర్మారం గ్రామ అధ్యక్షులుగా దుర్గం లక్ష్మీనారాయణ, కలమడుగు గ్రామ అధ్యక్షుడిగా బండ శ్రీకాంత్, ముర్రిగూడ గ్రామ అధ్యక్షుడిగా కామెరా చంద్రశేఖర్, మైనారిటీ మండల ప్రధాన కార్యదర్శిగా మౌలా బకాష్, లను నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కార్యకర్తలకు కోరారు. అన్ని గ్రామాల్లో పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు.

బీజేపీ శక్తి కార్నర్ మీటింగ్

నవతెలంగాణ-బేల

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లో తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ స్థాయి కార్యకర్తలు పని చేయాలని బీజేపీ నాయకులు రత్నాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌లో శుక్రవారం పార్టీ శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, కేంద్రం అందించే పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. బూత్ కమిటీ సభ్యులు పార్టీ గెలుపు దిశగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్ చంద్ర,జిల్లా అసెంబ్లీ కన్వీనర్ బోయర్ విజయ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ ఠాక్రే, బీజేపీ మండల అధ్యక్షుడు దత్త నిక్కం, బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్, కృష్ణ, శివకుమార్, సర్పంచ్ రాకేష్, మోరేశ్వర్, ప్రమోద్‌రెడ్డి, జీవన్, మహేష్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్ష సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షులు పడాల రవీందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎంఆర్సీ భవనం ముందర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లా ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్త పరచడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఇతర కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్న విధంగానే సమగ్ర శిక్ష ఉద్యోగులను కూడా రెగ్యులరైజ్ చేస్తూ పేస్కేల్ వర్తింపజేయాలని సాధారణ సెలవులు మంజూరు చేయాలని అన్నారు. మహిళలకు మెటర్నటీ సెలవులు, ఆరోగ్య జీవిత బీమా, వర్తింపజేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జాధవ్ ధరమ్ సింగ్, కోశాధికారి శ్యామసుందర్, మీడియా కార్యదర్శి సజ్జనపు దర్శన్, మండల స్థాయి ఉద్యోగులు మంజుల, రమేష్, పుష్పవేణి, రాజన్న, గణపతి పాల్గొన్నారు.

భూకబ్జాపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం(కె) గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమగూడెం(కె) సర్పంచ్ సపాట్ శంకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సపాట్ శంకర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రభుత్వ 30 గుంటల భూమి ఇస్లావత్ రాజేశ్వర్ అనే వ్యక్తి కబ్జా చేసి చుట్టూ ఫెంచన్ వేసి మామిడి మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కబ్జా విషయంలో తహసీల్దార్, పోలీస్ శాఖకు పిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకొని, కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకొని గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ పథకాలకు భూమిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమగూడెం (కె) గ్రామస్తులు పాల్గొన్నారు.

15 నుండి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ఈ నెల 15 వ తేదీ నుండి మార్చి 2వ తేదీ వరకు జనరల్, ఒకేషనల్ కోర్సుల పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుండి జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని అన్నారు. కళాశాల లాగిన్లలో హాల్ టికెట్లు, బ్యాచ్‌ల వారీగా లిస్టులు డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు తేదీల వారిగా వివరాలు తెలియజేయాలని తెలిపారు. విద్యార్థులకు తేదీల వారిగా సబ్జెక్టుల వివరాలు తెలియజేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ 20 కేంద్రాలు, ఒకేషనల్ 11 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఛీఫ్ సూపరింటెండెంట్లు, నిర్వాహకులకు శిక్షణ నిర్వహించి పరీక్షల సామాగ్రి అందజేయనున్నట్లు తెలిపారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్ల సకాలంలో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సర్కారు లక్షలాదిరూపాయలు వెచ్చిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి విద్యాప్రమాణాలను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జెడ్పీ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు పేర్కొన్నారు. మండలంలోని చారిగాం పాఠశాల ప్రహరీ నిర్మాణాలకు ఉపాధి హామీ నిధులు రూ. 4 లక్షలు మంజూరు కావడంతో ఈ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రహరీ నాణ్యతగా నిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చటారె స్వాతిపోశెట్టి, ఎంపీటీసీ సభ్యురాలు తారాబాయి, ఉపసర్పంచ్ తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

అంబులెన్స్ లేక అవస్థలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రిమ్స్‌లో పార్థివ దేహన్ని తరలించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్ డీజిల్ లేక నడవలేని పరిస్థితి ఏర్పడిందని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్ రెడ్డి అన్నారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎవరైనా మృతి చెందితే మృతదేహాన్ని వారి ప్రాంతాలకు తరలింపులో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. అసలే తమ కుటుంబంలో ఒకరిని కోల్పోయిన బాధలో ఉన్న వారి బంధువులకు మృతదేహాన్ని తరలించే క్రమంలో ముఖ్యంగా పేదవారికి నాన అవస్థలు తప్పడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రిమ్స్‌లో ఏర్పాటు చేసిన పార్థివ అంబులెన్స్ వాహనం ఉన్న లేనట్లుగానే పరిస్థితి ఏర్పడిందన్నారు. డీజిల్ కొరతతో ఆ వాహనం ముందుకు నడవలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఇదే విషయమై సంబంధిత రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్‌ను సంప్రదించిన ఇద్దరు కూడా రిమ్స్‌లో ఉన్న పార్థివ దేహన్ని తరలించే అంబులెన్స్ మా పరిధిలోకి రాదంటూ చేతులెత్తేశారు. ఇలాంటి పరిస్థితి ఏర్పడటం వల్ల బాధలో ఉన్న బంధువులు వారి మృతదేహన్ని ఇంటికి తరలించే క్రమంలో వేలకు వేల రూపాయలు పెట్టి ప్రయివేట్ అంబులెన్స్ ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అంబులెన్స్‌పై దృష్టి సాధించాలని కోరారు. అయితే సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే ఎంక్వయిరీ చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో ముత్యాల సురేష్ ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఐకేపీ ఉద్యోగస్తులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు వెళ్లనీయకుండ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం హేయనీయమైన చర్య అని ఐకేపీ ఉద్యోగస్తుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పూర్క బాపురావ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఐకేపీ వీఏఓలను క్రమబద్ధీకరణ చేస్తామని మోసగించారని అన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐకేపీ సిబ్బంది జానకి, రాజమణి, చంద్రకాంత్, వినోద్, జైపాల్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇంట్లో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఒంటరిగా ఉంటున్న తాతావార్ లక్ష్మి ఇంట్లో గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. స్టేషన్ అగ్నిమాపకాధికారి దుర్గా శివాజీ వెంటనే స్పందించి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని సకాలంలో మంటలను ఆర్పారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదని తెలిపారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులు, ఫర్నిచర్ తదితర వస్తువులు కాలిబూడిదవ్వడంతో లక్ష్మి కన్నీరు మున్నీరయ్యింది. తనకు ముగ్గురు కుమారులు ఉన్నప్పటికీ వారు ఎవరికి వారు ఉండటంతో ఈమె ఒంటరిగా ఉంటూ జీవనం కొనసాగిస్తోంది.

కీమో థెరపీ వార్డ్‌ను పరిశీలించిన రిమ్స్ డైరెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో క్యాన్సర్ బాధితులకు కీమో థెరపీ చికిత్సలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అందుకు ఎన్సీడీ ఆధ్వర్యంలో రిమ్స్‌లో కాన్సర్ కేర్ కీమో థెరపీ కేంద్రాన్ని కేటాయించారు. శుక్రవారం కాన్సర్ కేర్ కీమో థెరపీ వార్డ్‌ను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సందర్శించారు. రిమ్స్‌లో ముందుగా ఐదు పడకలతో ప్రత్యేక వార్డును కేటాయించినట్లు తెలిపారు. త్వరలో సుశిక్షితులైన సిబ్బందితో ఈ వార్డులో బాధితులకు వైద్యం అందించనున్నామని తెలిపారు. దీంతో బాధితులకు ధూరభారం తగ్గడంతో పాటు వ్యయ ప్రయాసలు తీరుతాయన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

నవతెలంగాణ-వేమనపల్లి

కల్యాణలక్ష్మీ పేదింటి ఆడబిడ్డలకు ఒక వరంలాంటిదని తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీపీ కోళి స్వర్ణలత, జెడ్పీటీసీ రుద్రభట్ల స్వర్ణలత అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 38 మంది లబ్ధిదారులకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.3,8లక్షల 4వేల 408 విలువ చేసే కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు వరం లాంటిదని అన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ మేనమామ స్థానంలో ఉండి ప్రతి ఇంటి ఆడపడుచుకు రూ.1,00,116 అందించి ఆదుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సుక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్, సర్పంచులు కుబిడే మధూకర్, గాలి మధు, కొండగొర్ల బాపు, జెల్ల మొండి, బెడ్డల రాజలింగు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్ పరీక్షకు కళాశాల నుండి 22 మంది విద్యార్థులు హాజరుకాగా విద్యార్థుల్లో ఏకంగా 14 మంది విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. విద్యార్థులను అభినందించి వివరాలను వెల్లడిస్తూ 14 మంది అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని వీరిలో ఎలమద్దాసరి వంశీ 89.22శాతంతో కళాశాల టాపర్‌గా నిలువగా, దుర్గం దీక్షిత్ 71.04 శాతంతో, రాంటెంకి ఆశిష్ 70.74శాతం, గంపల వంశీకృష్ణ 55.51శాతంతో, కర్మాంకర్ దేవరాజ్ 51.42శాతంతో, దుర్గం పవన్ కళ్యాణ్ 45శాతంతో, దాడివాలే సుశీల్ 43.73శాతంతో తరువాత స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించడంతోపాటు ఇతరులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రేసు ఉపేందర్, నరసింహ చారి, కోసరి మహేష్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ధర్మారావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ రొడ్డ లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు కంటి వెలుగు శిబిరానికి హాజరు కాగా వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ ఎంఏ అలీం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులారెడ్డి, సర్పంచ్‌లు అజ్మీర తిరుపతి, మక్కల శ్రీనివాస్, ముత్యాల స్వప్న, ఎంపీటీసీ మల్లేష్, నాయకులు ఏనుగు సుధాకర్‌రెడ్డి, బాణాల సత్యనారాయణ, రాంటెంకి వాడేవ్, బాసవేణి కొమురయ్య, ముత్యాల రాజయ్య, సక్రియ, దేవీలాల్, మంగ శ్రీకాంత్, కార్యదర్శి అన్నపూర్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కనికారపు అశోక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘ కార్యాలయంలో జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తాలోని హౌరాలో ఫిబ్రవరి 15 నుంచి వ 18 వ తేదీ వరకు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఆ మహాసభలకు అందరూ తరలి రావాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం రైతులపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తుందన్నారు. ఆ మహాసభకు అధిక సంఖ్యలో తరలి వెళ్లి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకటికారి బుచ్చయ్య, రాజమౌళి, జయక్క పాల్గొన్నారు.

రూ.500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం

గల్ఫ్ కార్మికులకు రూ.500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని గల్ఫ్ సంక్షేమ సమితి రాష్ట్ర నాయకులు మహ్మద్ అలీం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చినటువంటి వాగ్దానాలను 2014 బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో చేర్చినటువంటి బొంబాయి, బొగ్గు బాయి, దుబాయ్ అనే అంశంలో వలస కార్మికులకు సంబంధించిన అంశాలను పొందుపరచిందని అన్నారు. దీనిలో భాగంగా వారి సక్షేమం కోసం ప్రభుత్వ భూములు అమ్మి రూ.500 కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెడతమని 9 సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు. విదేశాలలో ఉన్నటువంటి వలస కార్మికులు చాలా విషయాలు తెలియక చేస్తున్నటువంటి తప్పుల వల్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. ఇలాంటి విషయాలపై ప్రభుత్వం అవగాహన కల్పించకపోవడం ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. ఇతర దేశాల్లో తప్పులు చేసిన కార్మికులు దాదాపు 8,000 మందికి పైగా భారతీయులు ప్రస్తుతం విదేశీ జైళ్లలో ఉన్నారని అన్నారు. వీరిలో 4,389 మంది గల్ఫ్ దేశాలలో ఉన్నారు. కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ తెలిపారని అన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సహాయ నిధి కోసం రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. లేని యెడల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ విజయ డెయిరీ చైర్మన్



నవతెలంగాణ-తలమడుగు

అదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌రాజ్‌ను శుక్రవారం మాజీ విజయ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు.